క్లుప్తంగా

నేదురుమల్లి నివాసంలో నేతల కోలాహలం



కార్యకర్తలతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్‌ : వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన పోరుబాట కార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలోని వెంకటగిరి పట్టణం, రూరల్‌, బాలాయపల్లి, డక్కిలి, రాపూరు, సైదాపురం, కలువాయి మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో నేదురుమల్లి నివాసం వద్దకు తరలిరావడంతో కోలాహలం నెలకొంది. ఈ మేరకు నేదురుమల్లి రామ్‌కుమార్‌ రెడ్డి నేతలు, కార్యకర్తలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

పోరుబాట ర్యాలీకి తరలిన యువత

ఓజిలి: నాయుడుపేట పట్టణంలో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో జరిగే విద్యుత్‌ చార్జీల బాదుడుపై పోరుబాట ర్యాలీకి ఓజిలి మండలం వెంకటరెడ్డిపాళెం యువత శుక్రవారం తరలివెళ్లారు. వైఎస్‌ఆర్‌ సీపీ సీనియర్‌ నాయకుడు బట్టా అనిల్‌కుమార్‌ యాదవ్‌, యువత అధ్యక్షుడు బట్టా పృధ్వీకుమార్‌యాదవ్‌ ఆధ్వర్యంలో 100 బైక్‌లలో వెళ్లి ర్యాలీలో పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం విద్యుత్‌ చార్జీలను తగ్గించాలని కోరారు.

ఘనంగా గోదాదేవి క్షేత్రోత్సవం



విశేషాలంకరణలో గోదాదేవి

రాపూరు: మండలంలోని పెంచలకోనలో వెలసిన శ్రీగోదాదేవికి ప్రత్యేక పూజలు, క్షేత్రోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని పెంచలకోనలో గోదాదేవికి నాలుగు శుక్రవారాలు ప్రత్యేక పుజలు, క్షేత్రోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా రెండో శుక్రవారం గోదాదేవి ఉత్సవ విగ్రహాన్ని తిరుచ్చిపై కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదపండితుల నడుమ కోన మాడ వీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. అమ్మవారికి భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు పెనుశిల లక్ష్మీనరసింహస్వామికి తిరుప్పావై, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాపూరు సీఐగా సత్యనారాయణ

రాపూరు : రాపూరు సర్కిల్‌ ఇన్‌స్పెక్టర్‌ సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన బాపట్ల స్పెషల్‌ బ్రాంచ్‌ సీఐగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న విజయకృష్ణ వీఆర్‌కు బదిలీ అయ్యారు. నూతన సీఐకి సిబ్బంది స్వాగతం పలికారు.

నాయుడుపేటలో పట్టణంలో నిరసన ర్యాలీ చేస్తున్న సంజీవయ్య తదితర నాయకులు



విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ వద్ద నినాదాలు చేస్తున్న వెంకటగిరి నేతలు



బాదుడుపై పోరు

- సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య
- ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన నేదురుమల్లి
- పోరుబాట ర్యాలీను అడ్డుకునేందుకు భారీగా మోహరించిన పోలీసులు
- విద్యుత్‌ కార్యాలయం వద్ద నాయకులను అడ్డుకున్న పోలీసులు

నాయుడుపేట టౌన్‌: రాష్ట్రంలో ఇష్టారాజ్యంగా దోచుకోవడం... దాచుకోవడం... దిగమింగడం తరహాలో టీడీపీ కూటమి పార్టీలు వ్యవహరిస్తున్నాయని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. వైఎస్‌ఆర్‌ సీపీ రాష్ట్ర అధినేత, మాజీ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కరెంట్‌ చార్జీల బాదుడుపై నాయుడుపేటలో పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య సారధ్యంలో ఆ పార్టీ సీనియర్‌ నాయకుడు కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, సూళ్లూరుపేట నియోజవర్గ పరిధిలోని ఆరు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ముందుగా నాయుడుపేట పట్టణంలోని డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ విగ్రహం వద్ద నుంచి మోటార్‌ బైక్‌లలో నిరసన ర్యాలీ చేపట్టారు. అయితే పోలీసులు అనుమతులు లేవంటూ ర్యాలీని అడ్డుకునేందుకు పలు కూడళ్ల మోహరించారు. అయినప్పటికి మాజీ ఎమ్మెల్యే నివాసం వద్ద నుంచి బైక్‌లలో సంజీవయ్యతోపాటు నాయకులు నిరసన ర్యాలీ నిర్వహించారు. పిచ్చిరెడ్డితోపు వీధిలో ఉన్న విజయగణపతి ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయం వద్ద నుంచి ప్లకార్డులు ప్రదర్శిస్తూ విద్యుత్‌ శాఖ ఈఈ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. కార్యాలయం గేటు మూసి వేసి మాజీ ఎమ్మెల్యే సంజీవయ్యతోపాటు నాయకులు లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. చివరకు 10 మందిని మాత్రమే పంపుతామని చెప్పి అనుమతి ఇచ్చారు. అయితే నాయకులపై నాయుడుపేట రూరల్‌ సీఐ సంగమేశ్వరరావు దురుసుగా ప్రవర్తించడంతో మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈఈ శ్రీనివాసులుకు వినతి పత్రాన్ని అందించారు. మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య విలేకరులతో మాట్లాడుతూ వైఎస్‌ఆర్‌ సీపీ ప్రజల పక్షాన ఉంటూ వారి సమస్యలపై పోరుబాట సాగిస్తుందన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్‌ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ నాయుడుపేట మండలం భీమవరంలో స్వర్ణముఖి నది నుంచి పెద్ద ఎత్తున ఇసుక తరలిస్తున్నారని ఆరోపించారు. తమిళనాడుకు ఇసుక అక్రమ రవాణా ను అధికారులు పట్టించుకోక పోవడంపై విమర్శలు గుప్పించారు. దీనిపై కోర్టుకు వెళతామన్నారు. నాయుడుపేట మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ కటకం దీపిక, ఎంపీపీ ధనలక్ష్మీ, పెళ్లకూరు జడ్పీటీసీ ప్రిస్కిల్లా, తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, సూళ్లూరుపేట ఎంపీపీ అనిల్‌ రెడ్డి, తడ మండల కన్వీనర్‌ ఆర్ముగం, నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, కలికి మాధవ రెడ్డి, ఓట్టురు కిషోర్‌ యాదవ్‌, రత్నశ్రీ, బైనా మల్లికార్జునరెడ్డి, కటకం జయరామయ్య, వెంకటకృష్ణారెడ్డి, చదలవాడ కుమార్‌, దారా రవి, పి.నాగార్జున, సుబ్బారావు యాదవ్‌ పాల్గొన్నారు.



చిల్లకూరు: గూడూరులోని విద్యుత్‌ శాఖ కార్యాలయంలో వద్ద నిరసనలో ఎమ్మెల్సీ, వైఎస్‌ఆర్‌ సీపీ నాయకులు

విద్యుత్‌ చార్జీలపై పోరు

సైదాపురం: విద్యుత్‌ చార్జీలు పెంచబోమని, నాణ్యమైన విద్యుత్‌ సరఫరా అవసరమైతే యూనిట్‌ ధరలు తగ్గిస్తామని ఊదరగొట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడు రూ.15 వేల కోట్ల భారాన్ని ప్రజలపై రుద్దారని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. సంపద సృష్టి అంటే ఇదే నాబాబు అంటూ ప్రభుత్వంపై ఘాటైన విమర్శలు వ్యక్తంచేశారు. వెంకటగిరి పట్టణంలో కరెంట్‌ చార్జీల బాదుడుపై వైఎస్‌ఆర్‌ సీపీ పోరుబాట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. నియోజకవర్గంలోని కలువాయి, సైదాపురం, రాపూరు, బాలాయపల్లి, డక్కిలి, వెంకటగిరి మండలాల నుంచి భారీ సంఖ్యలో నాయకులు, ప్రజాప్రతినిధులు ఉదయాన్నే వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసం వద్దకు చేరుకున్నారు. పాలకేంద్రం సమీపంలో ఉన్న సబ్‌స్టేషన్‌ ఎదుట నినాదాలతో హోరెత్తించారు. కూటమి ప్రభుత్వం ప్రజలపై మోపిన విద్యుత్‌ చార్జీలను వెనక్కి తీసుకోవాలని, చార్జీల పెంపు వెంటనే రద్దు చేయాలని, ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని డిమాండ్‌ చేశారు. అనంతరం ట్రాన్స్‌కో ఏఈ అశోక్‌కు మండల నేతలతో కలసి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల హామీలు తుంగలో తొక్కిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. విద్యుత్‌ చార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం గద్దెనెక్కిన తర్వాత రెండు సార్లు కరెంట్‌ చార్జీలను పెంచిందన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటమీద నిలబడ్డ ఏకైక వ్యక్తి వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డి అని కొనియాడారు. కూటమి ప్రభుత్వం సంపద సృష్టిస్తామని చెప్పి ప్రతి దానికి గత ప్రభుత్వంపై నిందలు వేయడం భావ్యం కాదన్నారు. అప్పులు తెస్తే శ్రీలంకలాగా అయిపోతుందన్న కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో ఎన్నివేల కోట్లు అప్పులు తెచ్చారో ప్రజలకు తెలియజేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ సేతరాసి బాలయ్య, సైదాపురం మండల వైఎస్‌ఆర్‌ సీపీ అధ్యక్షుడు మన్నారపు రవికుమార్‌యాదవ్‌, 14వ వార్డు కౌన్సిలర్‌ ఆరి శంకరయ్య, పోలేరమ్మ తల్లి దేవస్థానం మాజీ చైర్మన్‌ పులి ప్రసాద్‌రెడ్డి, మండల కన్వీనర్లు కాల్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వెందోటి కార్తీక్‌రెడ్డి, పెట్లూరు జగన్‌మోహన్‌రెడ్డి, జేసీఎస్‌ కన్వీనర్లు శ్రీనివాసులురెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాస రాజు, నారాయణరెడ్డి, మోహన్‌రావు, శివకుమార్‌, జి.శ్రీనివాసులునాయుడు, సైదాపురం వైస్‌ ఎంపీపీ భాస్కర్‌, పూజారి లక్ష్మి, కౌన్సిలర్లు వహిద, కందాటి కళ్యాణి, నాయకులు రాంగోపాల్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, దయాకర్‌రెడ్డి, రాజారెడ్డి, యస్దానిబాషా, కూనామల్లికార్జున్‌, సదారెడ్డి, రమేష్‌రెడ్డి, తలపల్లి మల్లికార్జున్‌, జలగం కామాక్షి, కార్తికేయ, అల్లంసాయి తదితరులు పాల్గొన్నారు.

నమ్మక ద్రోహం చేస్తున్నారు

చిల్లకూరు: అధికారం చేపట్టిన తరువాత నమ్మక ద్రోహం చేస్తూ భారీగా విద్యుత్‌ చార్జీలు పెంచి ప్రజలపై పెనుభారం మోపుతున్నారని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌ దుయ్యబట్టారు. వైఎస్‌ఆర్‌ సీపీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు గూడూరు పట్టణంలోని ఐసీఎస్‌ రోడ్డులో ఉన్న విద్యుత్‌శాఖ కార్యాలయం ఎదుట శుక్రవారం పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి రావడంతో ఆ మార్గం మొత్తం కిటకిటలాడింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మురళీధర్‌ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఒక వైపు చంద్రబాబు ప్రచారంలో బాదుడేబాదుడు అంటూ ప్రసంగాలు చేశారన్నారు.
ఇప్పుడు ప్రజలకు ఏం సమాధానం చెబుతారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని కూడా నెవేర్చలేక వైఎస్‌ఆర్‌ సీపీని విమర్శించడం రివాజుగా మార్చుకున్నారని తెలిపారు. ప్రపంచ విపత్తుగా భావించిన కోవిడ్‌ సమయంలో కూడా వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పేద వారికి సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. ఎలాంటి విద్యుత్‌ చార్జీల భారం లేకుండా చేశారని, ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా విద్యుత్‌ను అందించారన్నారు. అనంతరం విద్యుత్‌ శాఖ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందించారు. విద్యుత్‌ చార్జీల భారం తగ్గించేలా ప్రభుత్వానికి సిఫారసులు పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాకాడు, చిట్టమూరు, కోట జెడ్పీటీసీలు రామక్రిష్ణ, చిప్పల వెంకటయ్య, కోటయ్య, గూడూరు, చిల్లకూరు, కోట, చిట్టమూరు మండలాల కన్వీనర్లు మల్లు విజయకుమార్‌రెడ్డి, యద్దల మధుసూదన్‌రెడ్డి, సంపత్‌కుమార్‌రెడ్డి, సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి, అన్ని మండలాల వైఎస్‌ఆర్‌ సీపీ శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు.

మాజీ ప్రధానికి సంతాపం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రూపకర్త మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌ మృతికి వైఎస్‌ఆర్‌ సీపీ శ్రేణులు సంతాపం వ్యక్తం చేశాయి. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌ సూచనలతో పోరుబాటకు వచ్చిన ప్రతి ఒక్కరు రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలియజేసారు.



చిల్లకూరు: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌ మృతికి మౌనం పాటిస్తున్న ఎమ్మెల్సీ, నాయకులు



నాయుడుపేటలో నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు



బైక్‌ ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



వెంకటగిరిలో పోరుబాట ర్యాలీ



ఏఈ అశోక్‌కు వినతి పత్రం అందజేస్తున్న నేదురుమల్లి

నేదురుమల్లి పరామర్శ

వెంకటగిరి రూరల్‌: పట్టణంలోని 17వ వార్డు కౌన్సిలర్‌, మున్సిపల్‌ విప్‌ పూజారి లక్ష్మి, శ్రీనివాస్‌ దంపతులను వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం నివాసం వద్దకు చేరుకొని దంపతులను పరామర్శించారు. పూజారి లక్ష్మి, భర్త శ్రీనివాసులకు ఇటీవల కాలుకు గాయమై విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ మేరకు ఆరోగ్యస్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ సేతరాసి బాలయ్య, జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, కౌన్సిలర్లు ఆరిశంకరయ్య, ఆటంబాకం శ్రీనివాసులు, వహిద, నాయకులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

గూడూరు రూరల్‌: రైలు కింద పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన గూడూరు పట్టంలోని రైల్వేస్టేషన్‌ సమీపంలో చోటు చేసుకుంది. శుక్రవారం ఉదయం మృతదేహం రైలు పట్టాలపై పడి ఉన్నట్లు సిబ్బంది గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహం పడి ఉన్న తీరును గమనించారు. కదులుతున్న రైలు కింద పడి మృతి చెందినట్లు అనుమానిస్తున్నారు. అతని వద్ద ఉన్న వివరాల మేరకు చిల్లకూరు మండలం, తిమ్మనగారిపాళెం గ్రామానికి చెందిన గిద్దలూరు రమేష్‌ (48)గా గుర్తించారు. మృతుడు కుటుంబ కలహాల కారణంగా మనస్తాపం చెంది ఇంటి వద్ద నుంచి వేకువజామున బయలు దేరి వచ్చి రైలు కింద పడి మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పాఠశాల క్లస్టర్లను సమీక్షించాలి

చిల్లకూరు: గూడూరు, చిల్లకూరు మండలాల్లో గతంలో ఉన్న విధంగానే పాఠశాల సముదాయాలను పునస్సమీక్షించాలని సర్వ శిక్ష జేఏసీ నాయకులు డిప్యూటీ డీఈఓ సనత్‌కుమార్‌కు వినతి ప త్రం అందించారు. గూడూరులోని ఉప విద్యాశాఖాధికారి కార్యాలయంలో సర్వ శిక్ష జేఏసీ నాయకులు ఉప విద్యాశాఖాధికారిని కలిసి మాట్లాడారు. కలుసుకుని మాట్లాడుతూ గతంలో ఉన్న విధంగా పాఠశాల క్లస్టర్లను ఉంచి ఇబ్బందులు తొలగించేలా చూడాలని కోరారు. దీనిపై ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారులకు సమస్యను వివరించిన అనంతరం నిర్ణయం తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌ సమగ్ర జేఏసీ రాష్ట్ర కో చైర్మన్‌ డాక్టర్‌ బొమ్మి నాగరాజు, జేఏసీ మండల నాయకులు, సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.

కిశోర వికాశంపై అవగాహన అవసరం

చిల్లకూరు: కౌమారదశలో ఉన్న ఆడపిల్లలు అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్‌ సీడీపీఓ మహబూబీ సూచించారు. మండల కేంద్రమైన చిల్లకూరు జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థినులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు కిశోర వికాసంపై అవగాహన కల్పించారు. ప్రతి మూడు సంవత్సరాలు పిల్లలను స్థానికంగా ఉండే అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రవూఫ్‌, ఐసీడీఎస్‌ ఏసీడీపీఓ జ్యోతికిరణ్‌, సూపర్‌వైజర్‌ నాగిశెట్టి రేణుక, హెల్త్‌ సూపర్‌వైజర్‌ రవి, వెలుగు సీసీ సుబ్రహ్మణ్యం. తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండాలి

దక్కిలి : విద్యార్థుల మధ్యాహ్నం భోజనం నాణ్యత ప్రమాణాలతో కలిగి రుచికరంగా ఉండాలని ఎంఈఓ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండలంలోని కమ్మపల్లి ప్రాథమికోన్నత పాఠశాల, మిట్టవడ్డీపల్లి, వెంబులూరు ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. వంట గది, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

చిల్లకూరు: రాజనేని రామానాయుడు చారిటబుల్‌ట్రస్టు ఆధ్వర్యంలో ఎల్‌వీప్రసాద్‌ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ నేతృత్వంలో చేడిమాల గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ట్రస్టు అధినేత రాజనేని శ్రీనివాసులు మాట్లాడుతూ శిబిరంలో 70 మందికి కంటి పరీక్షలు చేయించామన్నారు.